సాక్షి
అనంతపురం
సోమవారం । 14 । ఆగస్టు । 2023



నేడు జెడ్పీలో నా భూమి-నా దేశం
ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో 'నా భూమి – నా దేశం' జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు.



కిలో టమాట @ రూ.60
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.30, సరాసరిన రూ.45 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/22.9°
జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

లక్ష్మీనృసింహున్ని దర్శించుకున్న జిల్లా జడ్జి



జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

ఉరవకొండ/గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా జడ్జి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి, ఈఓ విజయ్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జిని ఈఓ సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

• అలాగే గుంతకల్లు మండలం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామిని జిల్లా జడ్జి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. వారికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా జడ్జి వెంట గుంతకల్లు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.మంజుల ఉన్నారు.

వజ్రకరూరు: వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామలింగేశ్వరస్వామిని జిల్లా జడ్జి దర్శించుకున్నారు.

ఉత్సాహంగా సెపక్‌తక్రా పోటీలు



ఉరవకొండ, బ్రహ్మసముద్రం మధ్య మ్యాచ్

ఉరవకొండ: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సెపక్‌తక్రా జిల్లా స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దావూద్‌తో పాటు సెపక్‌తక్రా సంఘం జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, షాహిన్ క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండురోజుల పాటు సాగే ఈ పోటీల్లో 30 బాల, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం తొలిరోజు పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఉరవకొండ మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం హైస్కూలు జట్టు విజేతగా, ఉరవకొండ ప్రభుత్వ పాఠశాల జట్టు రన్నరప్‌గా నిలిచాయి. తృతీయ స్థానంలో బ్రహ్మసముద్రం జెడ్పీ స్కూల్ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో తట్రకల్లు కేజీబీవీ జట్టు విజేతగా నిలవగా, ఆమిద్యాల జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచింది. తృతీయ స్థానంలో ఉరవకొండ మహేశ్వరీ స్కూల్ జట్టు నిలిచింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ఎస్టీటీ మధుబాబు చేతుల మీదుగా బహుమతులు అందించారు. సోమవారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో పీడీ మారుతీప్రసాద్, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్డులు సిద్ధం

- జిల్లాకు 10,023 కార్డుల మంజూరు
- లబ్ధిదారులకు ఈ-కేవైసీ చేస్తున్న వలంటీర్లు
- ఈ నెల నుంచే రేషన్ పంపిణీ



అనంతపురం అర్బన్: పేదల సంక్షేమానికి జగన్ సర్కారు ప్రాధాన్యతనిస్తోంది. అర్హులై ఉండి ఏదేని కారణంతో సంక్షేమ ఫలాలు అందని వారిని గుర్తించి ద్వైవార్షిక మంజూరు (బై యాన్యువల్ శాంక్షన్) ద్వారా లబ్ధి చేకూరుస్తోంది. ఇందులో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి బియ్యం కార్డులు మంజూరు చేసింది. జిల్లాలో కొత్తగా 10,023 బియ్యం కార్డుల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ తీసుకుంటున్నారు. ఆ తరువాత కార్డు అందజేస్తారు. కొత్త కార్డులకు ఈ నెల నుంచే బియ్యం, నిత్యావసర సరుకులు ఇస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

అర్హులందరికీ బియ్యం కార్డు..
దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత ఉన్న వారందరికీ బియ్యం కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. బియ్యం కార్డు కోసం 10,027 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 10,023 దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించింది. శింగనమలలో 1, పెద్దపప్పూరులో 3 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 6,54,158 బియ్యం కార్డులు ఉన్నాయి. ద్వైవార్షిక మంజూరు కింద కొత్తగా 10,023 కార్డులు రావడంతో వీటి సంఖ్య 6,64,181కు చేరింది. కొత్తగా మంజూరైన కార్డుల్లో అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో 4,884, గుంతకల్లు డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 2,683, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,756 బియ్యం కార్డులు ఉన్నాయి.

కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ..
జిల్లాకు మంజూరైన కొత్త బియ్యం కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. ఇప్పటివరకు 8,191 కార్డులను డౌన్‌లోడ్ చేశారు. మిగిలిన 1,832 కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారులకు పంపిణీ..
బియ్యం కార్డు మంజూరైన లబ్ధిదారుల వద్దకు వలంటీర్లు వెళ్లి ఈ-కేవైసీ తీసుకుంటున్నారు. అటు తరువాత వారికి కార్డును అందజేస్తారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 5,113 మంది లబ్ధిదారులకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేశారు. మిగిలిన 4,910 మంది లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో పూర్తవుతుందని అధికార వర్గాలు చెప్పాయి.

కార్డుల మంజూరు ఇలా..

నియోజకవర్గం	కార్డులు
రాయదుర్గం	1,282
ఉరవకొండ	1,428
గుంతకల్లు	1,090
తాడిపత్రి	1,345
శింగనమల	1,208
అనంతపురం అర్బన్	1,204
కళ్యాణదుర్గం	1,264
రాప్తాడు	1,202
మొత్తం	10,023

ఈ-కేవైసీ కొనసాగుతోంది



జిల్లాలో అర్హులైన 10,023 మందికి బియ్యం కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కార్డులను అధికారులు డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రక్రియను వలంటీర్లు నిర్వహిస్తున్నారు. ఈ-కేవైసీ పూర్తయిన వారికి కార్డుల పంపిణీ జరుగుతోంది.
– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ఇంటింటి సర్వే 60.77 శాతం పూర్తి



అనంతపురంలోని 72వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓ

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమం ఈ నెల 21న ముగియనుంది. 6,94,342 కుటుంబాలకు గాను ఈ నెల 12 నాటికి 4,22,673 (60.77 శాతం) కుటుంబాలను సర్వే చేశారు. ఇంటింటి సర్వేలో అనంతపురం అర్బన్ (51.64 శాతం), శింగనమల (53.54), ఉరవకొండ (54.90 శాతం) నియోజకవర్గాలు వెనుకబడ్డాయి. అత్యధికంగా గుంతకల్లు నియోజకవర్గంలో 75.18 శాతం సర్వే జరిగింది. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో 60 నుంచి 65 శాతం మధ్య సర్వే పూర్తయ్యింది. ఇక మిగిలిన వారం రోజుల వ్యవధిలో 39.33 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేయాల్సి ఉంది.

ఇద్దరు బీఎల్‌ఓల సస్పెన్షన్..
ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించని ఇద్దరు బీఎల్‌ఓలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌతమి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విడపనకల్లు మండలం కడదరబెంచి పోలింగ్ కేంద్రం– 3 బీఎల్‌ఓ అయిన వీఆర్‌ఏ భీమలింగమ్మ, పోలింగ్ కేంద్రం–9 (గడేకల్లు) బీఎల్‌ఓగా ఉన్న పంచాయతీ కార్యదర్శి శిల్ప ఇంటింటి సర్వే విధులను సక్రమంగా నిర్వహించలేదని ఈఆర్‌ఓ ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకున్నారు.

నేడు నాలుగు నియోజకవర్గాల సమీక్షా సమావేశాలు



అనంతపురం సిటీ/ అర్బన్: జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో నాలుగు నియోజకవర్గాల సమీక్షా సమావేశాలు సోమవారం నిర్వహించనున్నట్లు సీఈఓ భాస్కర్ రెడ్డి తెలిపారు. అనంతపురం అర్బన్, శింగనమల, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష ఉంటుందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి హాజరవుతారు. ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అక్రమాలకు అడ్డుకట్ట

- పంచాయతీల్లో ఇక డిజిటల్ లావాదేవీలు
- రేపటి నుంచే ప్రారంభం



కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యాలయం

అనంతపురం రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న సంకల్పంతో ఏర్పడిన పంచాయతీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు తీసుకొచ్చాయి. పంచాయతీల్లో ఇదివరకు మ్యానువల్ విధానంలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేసేవారు. అయితే పన్నుల చెల్లింపు విషయంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటుండటంతో మ్యానువల్ విధానానికి చెక్ పెట్టి ఇక నుంచి నగదు రహిత (డిజిటల్) లావాదేవీలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నుంచి అన్ని రాష్ట్రాల్లోనూ నగదు రహిత లావాదేవీల ప్రక్రియను ప్రారంభించనున్నారు. దీంతో పంచాయతీల్లో ఇక నుంచి ఇంటి, కొళాయి పన్నులు, భవనాల అద్దెలు, లేఅవుట్, భవన నిర్మాణ అనుమతి, లైసెన్సు ఫీజులు తదితర చెల్లింపులన్నీ డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.

లావాదేవీలు ఇలా...
ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,044 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏడాదికి అన్ని రకాల పన్నులు కలిపి రూ.వంద కోట్ల వరకు వసూలు చేస్తున్నారు. ఇక నుంచి గ్రామపంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే పంచాయతీలకు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిచారు. కేంద్రం అందించే ఆర్థిక సంఘం నిధులు నేరుగా ఆయా బ్యాంక్ ఖాతాలోకి జమ కానున్నాయి. పంచాయతీ బ్యాంక్ ఖాతాలకు గూగుల్‌పే, ఫోన్‌పేలను అనుసంధానం చేస్తారు. క్యూఆర్ కోడ్, యూపీఐ స్కానర్ల ద్వారా పన్నులు వసూలు చేయనున్నారు. దీంతో పన్నులు ఎంత శాతం వసూలు చేశారు, ఎవరి నుంచి వసూలు చేశారు వంటి విషయాలు వెంటనే అధికారులకు తెలిసిపోతాయి. స్మార్ట్ ఫోన్ లేనివారు పంచాయతీ ఖాతాకు బ్యాంక్ ద్వారా లేదా ఇతరుల ఫోన్‌పే నుంచి పన్నులు చెల్లించవచ్చు. ప్రస్తుతం పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలంటే నగదు లేదా చెక్కుల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. అయితే ఇకనుంచి ఎలాంటి చెల్లింపులైనా డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. నగదు రహిత లావాదేవీల వల్ల క్యాష్ రిజిస్టర్, లెడ్జర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటుంది. దీంతో పంచాయతీల్లో జరుగుతున్న లావాదేవీల గురించి అధికారులు తెలుసుకునే వీలుంటుంది.

డిజిటల్ విధానంలోనే చెల్లింపులు
పంచాయతీల్లో వసూలు చేస్తున్న పన్నుల నుంచి అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసే ప్రతి పైసా ఇక నుంచి డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరపాలి. నగదురహిత లావాదేవీల వల్ల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడనుంది. కొంత మంది సిబ్బంది చేస్తున్న అక్రమాలను నిలువరించడానికి ఈ విధానం సరైంది. ఈ నెల 15 నుంచి చెల్లింపులన్నీ నగదురహిత లావాదేవీల విధానంలోనే ఉంటాయి. ప్రజలు ఇక నుంచి డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.
– ప్రభాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

4 నెలల్లో 40 శాతం వసూళ్లు

- మార్కెటింగ్ ఫీజు వసూళ్లలో పురోగతి



అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ వసూళ్ల లక్ష్యసాధన దిశగా సాగుతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలోనే వార్షిక లక్ష్యంలో 40 శాతం మేర వసూళ్లు కావడం విశేషం. జిల్లా పరిధిలో తొమ్మిది మార్కెట్ కమిటీల నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో వివిధ పన్నుల రూపేణా రూ.10.81 కోట్లు వసూళ్లు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించారు. జూలైతో ముగిసిన నాలుగు నెలల కాలంలో రూ.3.47 కోట్ల లక్ష్యానికి గాను రూ.4.22 కోట్లకు పైగా వసూళ్లయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.3.51 కోట్లు వసూలైంది. అంటే గతేడాది కన్నా రూ.71 లక్షలు పెరగడం విశేషం.

దూసుకెళ్తున్న అనంతపురం, శింగనమల కమిటీలు..
అన్ని మార్కెట్ యార్డుల్లో ఫీజు వసూళ్లు ఒకేలా కనిపించడం లేదు. ఇప్పటికే 56 శాతం వసూళ్లతో శింగనమల, 51 శాతంతో అనంతపురం మార్కెట్ కమిటీలు దూసుకెళుతున్నాయి. అత్యధికంగా అనంతపురం మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.4.10 కోట్లు కాగా ఇప్పటికే రూ.2.10 కోట్లు సాధించింది. శింగనమలలో రూ.75 లక్షలకు గాను రూ.23 లక్షలకు పైగా వసూలైంది. తర్వాత 42 శాతంతో ఉరవకొండ, 37 శాతంతో కళ్యాణదుర్గం, 33 శాతంతో తాడిపత్రి, 27 శాతం వసూళ్లతో రాయదుర్గం కమిటీలు పరవాలేదన్నట్లుగా నడుస్తున్నాయి. ఇక 12 శాతంతో రాప్తాడు, 16 శాతంతో గుంతకల్లు, 18 శాతం వసూళ్లతో గుత్తి మార్కెట్ యార్డులు లక్ష్యానికి ఆమడదూరంలో పయనిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరంలో ముగిసేలోపు 9 కమిటీలు వంద శాతం లక్ష్యం సాధించేలా యార్డులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టం చేస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. రాయలసీమ రీజియన్ పరిధిలో ఈసారి కూడా అవార్డు దక్కించుకుంటామన్నారు.

ఆ చతుష్టయం.. దండుపాళ్యం బ్యాచ్



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా దండుపాళ్యం బ్యాచ్‌ను తలపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు మేలు జరగడాన్ని సహించలేక దుష్ట చతుష్టయం దుష్ప్రచారంతో, అర్థరహిత ఆరోపణలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పైన, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లపైనా నోరుపారేసుకోవడాన్ని ఖండించారు. వలంటీర్ల ద్వారా మహిళల అక్రమ రవాణా జరుగుతోందని, వలంటీర్లు సంఘ విద్రోహశక్తులని చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్ధాంతాలు, లక్ష్యాలు, నిలకడ లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని విమర్శించారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడమే కాక కరోనా, వరదలు వంటి విపత్తుల వేళ ప్రాణాలు లెక్కచేయక ఇతోధిక సేవలందిస్తున్న ప్రజాసేవకులు వలంటీర్లు అని అభివర్ణించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన ఎన్ని కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని స్పష్టం చేశారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం







పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, కవాతులో పోలీసులు, విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న స్వాతంత్ర్య చిహ్నం క్లాక్‌టవర్

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్ : పంద్రాగస్టు వేడుకలకు అనంతపురం నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. క్లాక్‌టవర్‌తో పాటు నూతన ఫ్లై ఓవర్‌ను విద్యుత్ కాంతులతో అలంకరించారు. జిల్లాస్థాయి వేడుకలు నిర్వహించే పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో పోలీసు సాయుధ బలగాల విన్యాసాలు, విద్యార్థుల దేశభక్తి గీతాలాపాన, నృత్యాల రిహార్సల్స్‌ను ఆదివారం ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. విజయవంతంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, ఆర్‌ఐ, పలువురు ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి



అధికారులకు సూచనలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు పోలీసు పరేడ్ మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. సీటింగ్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర వాటికి అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డీఈఓ సాయిరాం, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఏపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, డీపీఓ ప్రభాకర్, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తానయ్య గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: స్థానిక పాత గుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ దర్గా ధర్మకర్తలు, వక్ఫ్‌బోర్డు అధికారులు, ముజావర్ల నేతృత్వంలో ఈ ఉత్సవం కొనసాగింది. అందంగా అలంకరించిన గంధం పల్లెంను గుర్రంపై ఉంచి మేళతాళాలతో దర్గా నుంచి గణాచారి రెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. సాజెదినాసేన్ (పూజారులు) ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. మస్తానయ్య ప్రార్థనా మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిక్కిరిసాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిక్కిరిసిపోయాయి.

యంత్ర'సాయం'లో మేటి



ట్రాక్టర్ నగర్ ముఖద్వారం

గార్లదిన్నె ట్రాక్టర్ నగర్ గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఇదేదో కాలనీ అనుకుని పొరబడే వారూ ఉన్నారు. వాస్తవానికి ఇది ప్రసిద్ధ సంస్థ. వ్యవసాయ యంత్ర పరికరాల పరీక్షణ, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో అత్యంత కీలకమైనది. ఇక్కడ ధ్రువీకరణ పొందిన వ్యవసాయ యంత్ర పరికరాలకు మాత్రమే ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ సంస్థ నాలుగు దశాబ్దాలుగా ఏడు రాష్ట్రాలకు సేవలందిస్తోంది.

- ఏడు రాష్ట్రాలకు సేవలందిస్తున్న గార్లదిన్నె ట్రాక్టర్ నగర్
- వ్యవసాయ యంత్రాల పరీక్ష, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో కీలక సంస్థ
- రైతులు, యువత, విద్యార్థుల శిక్షణలోనూ కీలకపాత్ర

సాక్షి, అనంతపురం డెస్క్: ఆధునిక పద్ధతులను అవలంబించినప్పుడే ఏ రంగంలోనైనా ప్రగతి సాధ్యమవుతుంది. ఇందుకు వ్యవసాయ రంగమూ మినహాయింపు కాదు. పెరిగిన పెట్టుబడులు, కూలి ఖర్చుల కారణంగా సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం రైతులకు భారంగా మారింది. ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్న రైతులు మాత్రమే ఎంతో కొంత లాభపడుతున్నారు. ఇందులో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం ఒకటి. ప్రస్తుతం వివిధ రకాల యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ట్రాక్టర్ మొదలు పంట కోత యంత్రాలు, స్ప్రేయర్లు, భూమిని దున్నే, చదును చేసే యంత్ర పరికరాలను రైతులు వినియోగిస్తున్నారు. ఇవి అందుబాటులోకి రావడం వెనుక వివిధ సంస్థల కృషి ఉంది. అలాంటి సంస్థల్లో దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ట్రాక్టర్ నగర్ (గార్లదిన్నె) అత్యంత కీలకమైనది.



ట్రాక్టర్ నగర్‌లో ప్రదర్శనకు ఉంచిన వివిధ రకాల యంత్ర పరికరాలు



వేరుశనగ కాయల నూర్పిడిపై శిక్షణ పొందుతున్న మహిళా రైతులు

ఏడు రాష్ట్రాలకు ఏకైక సంస్థ..

వ్యవసాయ యంత్రాలను పరీక్షించడంతో పాటు వినియోగం, మెరుగుదలపై యువత, విద్యార్థులు, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 1983 సంవత్సరంలో గార్లదిన్నె మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసింది. భారతదేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు శిక్షణ కేంద్రాల్లో ట్రాక్టర్ నగర్ ఒకటి. దేశంలో బుదిని (మధ్యప్రదేశ్), హిస్సార్ (హర్యానా), విశ్వనాథచారియాలి (అస్సాం), ట్రాక్టర్ నగర్ గార్లదిన్నె వ్యవసాయ యంత్రాలపై శిక్షణ–పరీక్షణ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాలకు సేవలందించేందుకు ట్రాక్టర్ నగర్‌లో సంస్థను నెలకొల్పారు. కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా నడుస్తూ, ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు/సంస్థలు తయారు చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను పరీక్షించడంతో పాటు నాణ్యతను ధ్రువీకరిస్తోంది. ఇక్కడ ధ్రువీకరించిన వాటికి మాత్రమే ప్రభుత్వ సబ్సిడీలు వర్తిస్తుండటంతో దక్షిణ భారతదేశంలో తయారయ్యే ఆధునిక యంత్ర పరికరాలను టెస్టింగ్ నిమిత్తం ఇక్కడికి తెస్తున్నారు. వాటి పనితీరు పరిశీలించి, అవసరమైన మార్పులు కూడా సూచిస్తున్నారు.

శిక్షణ.. ఉపాధి కల్పన

వ్యవసాయ యంత్ర పరికరాల మరమ్మతులు, వినియోగం, సాంకేతిక అంశాలపై శిక్షణ పొందేందుకు వివిధ రాష్ట్రాల రైతులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. వ్యవసాయ పరికరాల ఉత్పత్తిదారులు, విక్రయ సిబ్బంది, మహిళా రైతులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. వారం మొదలు ఆరు వారాల వరకూ యూజర్ లెవల్ కోర్సులు, రెండు వారాల నుంచి ఆరు వారాల వరకూ టెక్నికల్ కోర్సులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. కనీస విద్యార్హత ఎనిమిదో తరగతిగా నిర్దేశించారు. శిక్షణ పొందే వారికి ఉపకార వేతనాలు ఇస్తున్నారు. వసతి కూడా ఉచితంగా కల్పిస్తున్నారు.

50 వేల మందికిపైగా శిక్షణ..

ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి దాకా 50 వేల మందికిపైగా శిక్షణ పొందారు. వివిధ కంపెనీలు తయారు చేసిన 50 యంత్ర పరికరాలను ధ్రువీకరించారు. ఇటీవల కొత్తగా నిమాటిక్ సీడ్ డ్రిల్, విద్యుత్ వరికోత యంత్రాలు, 6, 8 వరసల్లో వరి నాటే యంత్రాలను పరీక్షించారు. వివిధ రాష్ట్రాల్లోని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

శిక్షణ చాలా బాగుంది.



జోధ్‌పూర్‌లోని కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ అగ్రికల్చర్ లో ఇంజినీరింగ్ చదువుతున్నా. ఏ–1 సిరీస్ కోర్సులో భాగంగా నెల పాటు శిక్షణ కోసం ఇక్కడికి వచ్చా. మౌలిక వసతులు బాగున్నాయి. వ్యవసాయ విజ్ఞానం పెంపొందించుకున్నా. ఇక్కడి అధికారులు ఎంతో ఓపిగ్గా అన్ని అంశాలను వివరిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. శిక్షణ చాలా బాగుంది.

– అభిషేక్ మోదన్‌వాల్, జోధ్‌పూర్

ఉపకార వేతనం అందుకున్నా



నేను జోధ్‌పూర్‌లో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ చదువుతున్నా. వ్యవసాయ యంత్ర పరికరాలపై శిక్షణ కోసం దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాలు శిక్షణ, పరీక్షణ సంస్థకు వచ్చా. వ్యవసాయ యంత్రాల మరమ్మతులు, ఉపయోగించే విధానంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అన్ని అంశాలను అర్థవంతంగా వివరించారు. శిక్షణ సమయంలో ఉపకార వేతనం కూడా పొందుతున్నా.

– రాహుల్ దూద్‌వాల్, జోధ్‌పూర్

మరింత అభివృద్ధి చేస్తాం



అన్ని పంటలకు సంబంధించిన ఆధునిక పరికరాలను ట్రాక్టర్ నగర్‌లో ప్రదర్శనకు ఉంచుతాం. నేను గతంలో భోపాల్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించేవాడిని ప్రభుత్వం డైరెక్టర్ హోదా కల్పించి ట్రాక్టర్ నగర్‌కు బదిలీ చేసింది. సిబ్బంది సహకారంతో దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను మరింత అభివృద్ధి చేస్తా. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పెట్టుబడులు తగ్గించవచ్చు.

– డాక్టర్ బాలాజీ మురారి, డైరెక్టర్, ట్రాక్టర్ నగర్

ఇండియన్ బ్యాంక్ Indian Bank

అనంతపురము శాఖ (0056)
IFSC : IDIB000A022

రైల్వే ఫీడర్ రోడ్, అనంతపురము - 515 001
Ph: 08554-245409
email: ananthpur@.co.in

అనుబంధం-IV అనంతపురము : 08-08-2023

స్వాధీనతా ప్రకటన

(రూల్ - 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2022 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన తమ అధికారములను వినియోగించుకుంటూ, ఇండియన్ బ్యాంక్ అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 29.04.2023 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత **శ్రీ జింక భాస్కర్, ప్రొప్రైటర్ మెసర్స్ కృష్ణ ఇండస్ట్రీస్** మరియు గ్యారంటార్ సహిత తనఖాదారు **శ్రీ బి. మంజునాథ్ తండ్రి ఓబులేసు**, గ్యారంటార్ సహిత తనఖాదారు **శ్రీమతి రాగ వరలక్ష్మి భర్త నరసింహులు** మరియు గ్యారంటార్ **శ్రీ జింక హరికృష్ణ తండ్రి జె. నారాయణప్ప**ను సదరు 29.04.2023 తేదీగల డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా చెల్లించవలసిన ఔట్‌స్టాండింగ్ బకాయి 28.04.2023 నాటికి మొత్తం **రూ.40,77,883/- (నలభై లక్షల డెబ్బైఏడు వేల ఎనిమిది వందల ఎనభైమూడు రూపాయలు మాత్రమే)**తో పాటు తిరిగి చెల్లించే తేదీ వరకు దానిపై తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు చార్జీల **ఇండియన్ బ్యాంక్, అనంతపురము బ్రాంచ్, అనంతపురము**కు సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరారు.

సదరు రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ ఇందులో దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **08 ఆగస్టు, 2023**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారమునైనా 28.04.2023 నాటికి మిగులు బకాయి మొత్తం **రూ.40,77,883/- (నలభై లక్షల డెబ్బైఏడు వేల ఎనిమిది వందల ఎనభైమూడు రూపాయలు మాత్రమే)**తో పాటు దానిపై తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు **ఇండియన్ బ్యాంక్** చార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూరిటీలను విడిపించు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు మరియు అందులో రూపొందించబడిన నియమాల ప్రకారం వ్యవహరించి సెక్యూరిటీలను విడిపించుకునే హక్కు హక్కు మీకు ఉందని మిమ్మల్ని కోరడమైనది."

స్థిరాస్తుల వివరణ

ఐటం నం.1 (శ్రీ బి. మంజునాథ్ తండ్రి ఓబులేసుకు చెందిన ఆస్తి):

అనంతపురము జిల్లా, రాచానపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని అనంతపురము అర్బ్ మరియు ఎస్సార్ట్‌లో ఉన్న సర్వే నం.139/1ఎ, ప్లాట్ నం.58 మరియు ప్లాట్ నం.59లో నిర్మించబడిన నివాస ఇల్లు యావత్తు మొత్తం విస్తీర్ణం 4.00 సెంట్లు లేదా 193.6 చ.గజాలు. **సైట్ కొలతలు:** తూర్పు నుండి పశ్చిమం - 30 అ. లేదా 9.14 మీటర్లు; ఉత్తరం నుండి దక్షిణం - 58 అ. లేదా 17.70 మీటర్లు; 4.00 సెంట్లు లేదా 193.6 చ.గజాల విస్తీర్ణంగల సైట్. **సరిహద్దులు:** తూర్పు - ప్లాట్ నం.59 - బి. పెద్దయ్యలు ఆస్తి; పశ్చిమం - ప్లాట్ నం.58లోని మిగతా ప్లాట్ (1.34 సెంట్లు); ఉత్తరం - ప్లాట్ నం.54, 53; దక్షిణం - 25 అడుగుల రోడ్డు. అనంతపురము జిల్లా, రాచానపల్లి పంచాయితీ పరిధిలోని పాత డి.నం.2-466 మరియు కొత్త డి.నం.2-668 కలిగిన నివాస ఇల్లు.

ఐటం నం.2 (శ్రీమతి రాగ వరలక్ష్మికి చెందిన ఆస్తి):

అనంతపురము జిల్లా, రాచానపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని అనంతపురము అర్బ్ మరియు ఎస్సార్ట్‌లో ఉన్న సిండికేట్ నగర్, సర్వే నం.102 మరియు 103 భాగం, ప్లాట్ నం.50లో నిర్మించబడిన నివాస ప్లాట్ మరియు షెడ్డు యావత్తు మొత్తం విస్తీర్ణం 4.00 సెంట్లు లేదా 193.6 చ.గజాలు. **సైట్ కొలతలు:** తూర్పు నుండి పశ్చిమం - 19 అ. లేదా 5.79 మీటర్లు; ఉత్తరం నుండి దక్షిణం - 37 అ. లేదా 11.28 మీటర్లు; 1.61 సెంట్లు లేదా 78.11 చ.గజాల విస్తీర్ణంగల సైట్. **సరిహద్దులు:** తూర్పు - రాగ సుబ్రమణ్యంకు చెందిన ప్లాట్ నం.50లోని మిగతా ప్లాట్; పశ్చిమం - రోడ్డు; ఉత్తరం - ప్లాట్ నం.49; దక్షిణం - బళ్లారి రోడ్డు. అనంతపురము జిల్లా, రాచానపల్లి పంచాయితీ పరిధి సిండికేట్ నగర్‌లోని నివాస ప్లాట్ మరియు అందులో నిర్మించబడిన షెడ్డు.

తేది : 08-08-2023
ప్రదేశం : అనంతపురము

సం/- అధీకృత అధికారి,
ఇండియన్ బ్యాంక్, అనంతపురము

సామూహిక వివాహాలను జయప్రదం చేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈ నెల 19న పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత సామూహిక వివాహాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. ఉరవకొండ మండలం మైలారంపల్లిలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డితో కలసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19న ఉదయం 9 నుంచి 11 గంటల మధ్యలో 44 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయన్నారు. వేడుకలో పాల్గొనే వారికి భోజన వసతి ఉంటుందన్నారు. వధూవరులకు బంగారు తాళిబొట్టుతో పాటు ఇతర సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతి జంటకూ ఓ కుట్టు మిషన్ అందిస్తామన్నారు. వేడుకకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని, ఏర్పాట్లను తేజోనాథ్, అశోక్, చందా చంద్రమ్మ, ఏసీ పార్వతమ్మ, నరసింహులు, ఎంపీ రమణ, వీరన్న, గోవిందు, వెంకటేష్, మూలగిరిపల్లి ఓబన్న, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి నేతృత్వంలో కమిటీలు పర్యవేక్షిస్తాయని వివరించారు. వివాహ వేడుకను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ ఎంపీ రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

యువతి ఆత్మహత్య



మృతురాలు అర్చన

కూడేరు: మండలంలోని మరుట్ల–1 కాలనీకి చెందిన పుష్పావతమ్మ కుమార్తె బంగారు అర్చన (23) ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం తన ఇంట్లోనే ఆమె క్రిమి సంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, కొంత కాలంగా అర్చన తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేదని, నొప్పిని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి తొట్టెలో పడి విద్యార్థి మృతి



మృతుడు నాని

గార్లదిన్నె: ఈత సరదా ఓ విద్యార్థిని బలిగొంది. 108 సిబ్బంది తెలిపిన మేరకు.. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన నాని (13) అదే గ్రామంలో ఏడో తరగతి చదువుతున్నాడు. గార్లదిన్నె మండలంలోని శిరివరంలో నివాసముంటున్న అవ్వ ఇంటికి తల్లిదండ్రులతో కలసి పీర్ల పండుగకు వచ్చాడు. ఆదివారం గ్రామ శివారులోని దోబీఘాట్ వద్ద ఉన్న నీటి తొట్టెలో ఈత కొట్టేందుకు వెళ్లిన నాని.. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. ఎంత సేపటికీ కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో గాలింపు చేపట్టారు. చివరకు నీటి తొట్టెలో విగతజీవిగా తేలియాడుతున్న నానిని గుర్తించి, 108 అంబులెన్స్‌లో గార్లదిన్నె పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

కంబదూరు: భూ వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణలో తమ్ముడు దాడి చేయడంతో అన్న మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ముత్యాలప్ప, నరసింహులు, కిష్టప్పకు 1.50 ఎకరాల భూమి ఉంది. ఇటీవల వీరు భాగ పరిష్కారాలు చేసుకున్నారు. పొలంలో ఉన్న వ్యవసాయ బోరు కిష్టప్ప భాగానికి వచ్చింది. దీంతో ఆదివారం ముత్యాలప్ప కుటుంబసభ్యులు నరసింహప్పతో గొడవకు దిగారు. మాటమాటా పెరిగి ఆవేశంలో అన్న ముత్యాలప్ప (50) ఎదపై నరసింహప్ప కాలుతో తన్నాడు. ఘటనతో ముత్యాలప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావిలో విగ్రహం లభ్యం





విగ్రహం లభ్యమైన పురాతన బావి, లభ్యమైన విగ్రహం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కోట వీధిలోని పట్టాభి రామస్వామి ఆలయ సమీపంలో ఉన్న పురాతన బావిని శుభ్రం చేస్తుండగా రాతి విగ్రహం బయటపడింది. పూర్వం ఈ బావిలో నీటిని నిత్యపూజ కోసం బ్రాహ్మణులు సేకరించుకునేవారు. దీంతో ఈ బావిని మడుగు బావి అని పిలిచేవారు. కాల క్రమేణా పాడుపడిన ఈ బావిని స్థానికులు వారం రోజులుగా శుభ్రం చేస్తున్నారు. ఆదివారం బావిలో నుంచి పూడిక తీస్తుండగా నాగుల విగ్రహం బయటపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని విగ్రహానికి పూజలు చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ కు తనఖా పెట్టిన / చార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా** యొక్క అధీకృత అధికారిచే భౌతికంగ స్వాధీనతలోకి చేసుకోబడినదని, అవి **"ఎక్కడ ఎలా ఉన్నవో అక్కడ ఆ విధంగానే స్థితిలో** విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత, సహ రుణగ్రహీతలు మరియు గ్యారెంటార్(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

క్ర సం	రుణగ్రహీత మరియు సహ రుణగ్రహీత చిరునామాలు	ఆస్తి వివరణ	ముగింపు మొత్తము & తేది	రిజర్వు ధర / బయానా / బిడ్ పెరుగుదల మొత్తం	e-వేలం తేది / సమయం
1	**శ్రీ పాలెగారు రంగప్ప రాజు తండ్రి P. రామప్ప నాయుడు, డి.నెం. 1/238/1, కటిక వీధి ఐడీపీర్ టాకీస్ దగ్గర, కణేకల్ అనంతపురము జిల్లా. శ్రీమతి పాలెగారు రాధ భర్త P. రంగప్ప రాజు డి.నెం. 1/238/1, కటిక వీధి ఐడీపీర్ టాకీస్ దగ్గర, కణేకల్ అనంతపురము జిల్లా.**	అనంతపురము జిల్లా, కణేకల్ బసవేశ్వర నగర్ లోని కొత్తగ నిర్మించిన ఇల్లు కణేకల్ గ్రామం, కణేకల్ పంచాయితి, కణేకల్ S.R.D. మరియు అనంతపురము R.D. పరిధిలో ఆస్తి ఉంది. ఈ ఆస్తి రిజిస్టర్ సేల్ డీడ్ నెం. 679/2010 తేది : 28-04-2010 ప్రకారం P. రాధ భర్త P. రంగప్ప రాజుకు చెందినది. బాబు ప్రభుత్వ ఖుష్కీ సర్వే నెం. 461-A, A.C 3-67, A.C 1-19, ప్లాట్ నెం. 2 & 3. **సైట్ కొలతలు: తూర్పు-పడమర:** 52 అడుగులు లేదా 15-77 మీటర్లు **ఉత్తరం-దక్షిణం:** 42.5 అడుగులు లేదా 12-89 మీటర్లు **మొత్తం విస్తీర్ణం : 245.55 చ॥గ॥** **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.1 లోని శారద ప్లాట్; **పడమర :** కె. నసీమ బీ ప్లాట్ నెం. 4; **ఉత్తరం:** ప్లాట్ నెం. 36 & కాలువ; **దక్షిణం:** 20 అడుగుల వెడల్పు రోడ్డు.	**A.C No. 32439107483** 8-8-2023 నాటికి రూ. 5,17,527/- + వడ్డీ + చార్జీలు	రూ. 28,64,000/- / రూ. 2,86,400/- / రూ. 25,000/-	16-09-2023 ఉదయం 11-00 గంటల నుంచి మధ్యాహ్నం 12-00 గంటల వరకు

వివరమైన నియమ నిబంధనలు

a) వేలం/బిడ్డింగ్ వెబ్‌సైట్ www.bankeauctions.com ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా మాత్రమే ఉంటుంది. ఇ-వేలం అమ్మకం ప్రొసిడింగ్స్‌లో పాల్గొనేముందు వివరమైన నిబంధనల కోసం వెబ్‌సైట్ చూడవలసిందిగా బిడ్డర్లను సూచించడమైనది.

b) ఆస్తిని అధీకృత అధికారి వద్ద ముందస్తు అపాయింట్‌మెంట్‌తో **21-08-2023 నుంచి 31-08-2023 వరకు ఉ॥ 10-00 గంటల నుండి సా॥ 4-00 గంటల వరకు** తనిఖీ చేసుకోవచ్చును.

c) ఆస్తి రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు మరియు పాల్గొనే బిడ్డర్లు వేలం ప్రక్రియ సమయంలో తమ ఆఫర్‌ను తదుపరి పెంచుకోవచ్చును.

d) రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని అధీకృత అధికారి, **SBI, కణేకల్ బ్రాంచ్, అనంతపురము జిల్లా** పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిపాజిట్ చేయాలి లేదా **SBI, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా A/c No 37608381914, IFSC కోడ్: SBIN0002738** అకౌంట్‌కు జమ అయ్యేలా **RTGS/NEFT** ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా **15-09-2023న సా॥ 4-00 గం॥**లోగా డిపాజిట్ చేయాలి.

e) కాగోరు బిడ్డర్లు చెల్లుబాటు అగు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ మరియు ఇ-మెయిల్ చిరునామా కలిగి ఉండాలి. డిజిటల్ సిగ్నేచర్‌కు సంబంధించిన వివరాలకోసం సర్వీస్ ప్రొవైడర్ **మెసర్స్ C1 ఇండియా లిమిటెడ్, https://www.bankeauctions.com** ను సంప్రదించవలెను మరియు **ఆంధ్రప్రదేశ్ రీజియన్ కొరకు సంప్రదించవలసిన వ్యక్తి పేరు పి. ధరణీక్రిష్ణ, మొబైల్ : 9948182222, ఇమెయిల్ ID: dharani.p@c1india.com, సపోర్ట్ & బ్యాక్అప్ ఆఫీస్ : సపోర్ట్ టీమ్ సంప్రదించవలసిన నంబరు ల్యాండ్‌లైన్: 0124-4302021 /22/ 23 / 24, మొబైల్ : +91-7291981124 / 1125 / 1126.**

f) బయానా మొత్తం చెల్లించిన తరువాత కాగోరు బిడ్డర్లు దిగువ తెలిపిన డాక్యుమెంట్ల కాపీలు / వివరాలను **15-09-2023**న సా॥ 4-00 గం॥ లోగా **SBI, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా** వారికి స్వయంగా లేదా ఇమెయిల్ ద్వారా దాఖలు చేయాలి.

i) బయానా మొత్తం నిమిత్తం డిమాండ్ డ్రాఫ్ట్/ పే ఆర్డర్ RTGS/NEFT ద్వారా చెల్లిస్తే UTR నం.తో దాని అక్నాలెడ్జ్‌మెంట్ రసీదు.

ii) PAN కార్డు, ID రుజువు మరియు ఆధార్ రుజువు, ఫోటో కాపీలు. అయితే గెలుపొందిన బిడ్డరు బిడ్ మొత్తంలో మిగిలిన 25% మొత్తం చెల్లింపు చేయు సమయంలో బ్యాంక్‌నకు ఈ డాక్యుమెంట్ల యొక్క ఒరిజినల్స్‌ను దాఖలు చేయవలెను.

iii) బిడ్డరు పేరు, సంప్రదించవలసిన నంబర్లు, చిరునామా, ఇమెయిల్ ID.

iv) బయానా ఆన్‌లైన్ రిఫండ్ కోసం బిడ్డర్ల అకౌంట్ వివరాలు.

g) కాగోరు బిడ్డర్లు తమ పేర్లను పోర్టల్ మెసర్స్ C1 ఇండియా లిమిటెడ్ లో నమోదు చేసుకొని, వారి యూజర్ ID మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందవలెను. కాగోరు బిడ్డర్లు ఇ-వేలం పైన ఆన్‌లైన్ శిక్షణను సర్వీస్ ప్రొవైడర్ **మెసర్స్ C1 ఇండియా లిమిటెడ్, https://www.bankeauctions.com నుండి పొందవచ్చును మరియు ఆంధ్రప్రదేశ్ రీజియన్ కోసం సంప్రదించవలసిన వ్యక్తి పేరు పి. ధరణీక్రిష్ణ, మొబైల్ : 9948182222, ఇమెయిల్ ID: dharani.p@c1india.com, సపోర్ట్ & బ్యాక్అప్ ఆఫీస్ సపోర్ట్ టీమ్ సంప్రదించవలసిన నంబరు ల్యాండ్‌లైన్: 0124-4302021 / 22 / 23 / 24, మొబైల్ : +91-7291981124 / 1125 / 1126.**

h) గెలుపొందని బిడ్డరు డిపాజిట్ చేసిన బయానా మొత్తం వారికి తిరిగి ఇవ్వబడును. బయానా మొత్తం పైన ఎటువంటి వడ్డీ రాదు.

i) వేలం పైన తెలిపిన విధంగా రిజర్వు ధరతో ప్రారంభమగును. బిడ్డర్లు **రూ. 25,000/-** గణాకాలలో తమ ఆఫర్లను మెరుగుపరచుకోవచ్చును. ఆన్‌లైన్ వేలం ముగింపు సమయంలో అత్యధిక బిడ్ (రిజర్వు ధరకుమించి) దాఖలు చేసిన బిడ్డరును గెలుపొందిన బిడ్డరుగా ప్రకటించబడును. గెలుపొందిన బిడ్డరు పేరున అమ్మకం నిర్ధారించబడుతుంది. అదే సెక్యూర్డ్ క్రెడిటార్ నిర్ధరణకు లోబడి ఉంటుంది.

j) గెలుపొందిన బిడ్డరు అతనిని/ఆమెను గెలుపొందిన బిడ్డరుగా ప్రకటించిబడిన వెంటనే అమ్మకం ధరలో 25% (ఇప్పటికే చెల్లించిన బయానాతో సహా) చెల్లించాలి మరియు మిగిలిన మొత్తాన్ని సెక్యూర్డ్ క్రెడిటార్‌చే అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి **15 రోజుల** లోగా చెల్లించాలి. గెలుపొందిన బిడ్డరు అమ్మకం ధర చెల్లించుటలో విఫలమైతే, ఎటువంటి నోటీసు లేకుండా అధీకృత అధికారిచే అతను డిపాజిట్ చేసిన మొత్తం జప్తు చేసుకోబడును మరియు ఆస్తి తిరిగి అమ్మకమునకు ఉంచబడును.

k) 50 లక్షల రూపాయలు మరియు అంతకు మించిన అమ్మకపు ప్రతిఫలాల కొరకు గెలుపొందిన బిడ్డరు అమ్మకపు ప్రొసీడ్స్ పైన 1% రేటువంతున TDS ను డిడక్ట్ చేసుకొని, TDS సర్టిఫికేట్ యొక్క ఒరిజినల్ రసీదును బ్యాంక్‌నకు దాఖలు చేయాలి.

l) కన్వేయన్స్, స్టాంప్ డ్యూటీ / GST రిజిస్ట్రేషన్ మొ॥ వాటి కోసం అన్ని చార్జీలను వర్తించు విధంగా గెలుపొందిన బిడ్డరు మాత్రమే భరించాలి.

m) ఎట్టికారణాలు తెలియచేయకుండా ఇ-వేలంను వాయిదా వేయు/రద్దు చేయు లేదా నియమ నిబంధనలను మార్పు చేయు హక్కు అధీకృత అధికారికి గలదు.

n) ఇంటర్నెట్ యాక్సెస్ లేకపోతే అయితే ఇవేలంలో పాల్గొనుటలో ఆసక్తికల బిడ్డర్లు ఫెసిలిటేటింగ్ సెంటర్ అయిన సంబంధిత RBO ఆఫీస్‌ను లేదా SBI, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా వారిని సంప్రదించవలెను వారు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తారు.

o) తదుపరి వివరాలకు సంప్రదించండి అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా. (ఫోన్ నం. 8008551825), ఇమెయిల్ ID : sbi.02738@sbi.co.in లేదా మెసర్స్ రాయలసీమ ఎంటర్‌ప్రైజెస్, సంప్రదించవలసిన నం. **9949751921, 9666681372.** సర్వీస్ ప్రొవైడర్, మెసర్స్ **C1** ఇండియా లిమిటెడ్, **https://www.bankeauctions.com** మరియు ఆంధ్రప్రదేశ్ రీజియన్ కోసం సంప్రదించవలసిన వ్యక్తి పేరు పి.ధరణీక్రిష్ణ, మొబైల్: **9948182222**, ఇమెయిల్ **ID: dharani.p@c1india.com,** సపోర్ట్ & బ్యాక్అప్ ఆఫీస్ సపోర్ట్ టీమ్ సంప్రదించవలసిన నంబరు ల్యాండ్‌లైన్ : **0124-4302021/ 22/ 23 / 24,** మొబైల్: **+91-7291981124 / 1125 / 1126.**

ప్రత్యేక సూచన / హెచ్చరిక

బిడ్డర్లు తమ స్వంత ప్రయోజనం మేరకు ఆఖరి నిమిషాలు/ సెకెండ్లలో బిడ్డింగ్ చేయుటను నివారించాలి. అటువంటి సందర్భంలో లేదా వెండర్ పక్షాన ఏవైన తప్పిదాలు / పొరబాట్లు / వైఫల్యం (ఇంటర్నెట్ వైఫల్యం, విద్యుత్ వైఫల్యం మొ॥) వాటికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా సర్వీస్ ప్రొవైడర్ బాధ్యత వహించదు. అట్టి సందర్భంలో అట్టి ఇబ్బందికర పరిస్థితులను అధికమించేందుకు బిడ్డర్లు అవసరమైనట్టి బ్యాక్అప్, విద్యుత్ సరఫరా మరియు అవసరమగు ఇతర సదుపాయలు వంటి అవసరమైన ఏర్పాట్లు / ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకోవలసిందిగా కోరుచున్నాము. తద్వారా అట్టి స్థితిని వారు అధికమించగలుతారు మరియు వేలంలో విజయవంతంగా పాల్గొనగలుగుతారు.

ప్రదేశం : కణేకల్
తేది : 08-08-2023

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా.

క్లుప్తంగా

అందుబాటులో అంబులెన్స్



వద్దుపల్లి టోల్‌గేట్ వద్ద ఉన్న హైవే అంబులెన్స్

ఆత్మకూరు: అనంతపురం నుంచి కల్యాణదుర్గం వరకు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో 108 వాహనాలు ఉన్నా అనంతపురం నుంచి కల్యాణదుర్గం మధ్యన హైవేలో ప్రమాదాలు జరిగితే వెంటనే ఎన్‌ఏఐహెచ్ (హైవే) అంబులెన్స్ తక్షణమే వెళ్తుంది. ఈ అంబులెన్స్ ఆత్మకూరు మండలం వద్దుపల్లి వద్ద ఉన్న టోల్ గేట్ వద్ద ఉంటుంది. అనుకోకుండా హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 1033 టోల్ ఫ్రీనంబర్‌కు ఫోన్ చేయాలని అంబులెన్స్ ఈఎమ్‌టీ శ్రీనివాసులు తెలిపారు.

సామూహిక ఒడిబియ్యం



మహిళలకు ఒడిబియ్యం అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన ఒడిబియ్యం కార్యక్రమానికి జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సుబ్రమణ్యకుమార్ సతీమణి అనురాధ, పాతూరు అమ్మవారి శాల మహిళావిభాగం అధ్యక్షురాలు చల్లా స్వర్ణలత తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొని, సాయిట్రస్టు సేవలను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారి వైకుంఠ వాసుడి సేవలో ఒకరోజు పేరిట తిరుమలలో జరిగే అన్ని సేవలను అనంత వాసుల ముంగిటకు తెచ్చామన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాఘవేంద్ర, రాజు, నాయక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో రాధ స్కూల్ గెలుపు



విజేతలను అభినందిస్తున్న భారత మహిళా క్రికెటర్ బి.అనూష తదితరులు

అనంతపురం: క్రికెట్ టోర్నమెంట్‌లో రాధా స్కూల్ గెలుపొందింది. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. సెయింట్ డీపాల్ స్కూల్, రాధా స్కూల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాధ స్కూల్ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సెయింట్ విన్సెంట్ డీపాల్ స్కూల్ నాలుగు వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. రెహాన్ 27 పరుగులు, ఏ లలిత్‌కుమార్ 22 పరుగులు చేసి, కీలక పాత్ర పోషించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాధ స్కూల్ జట్టు 11.5 ఓవర్లలోనే 113 పరుగులు లక్ష్యాన్ని ఛేదించింది. రాధా స్కూల్ జట్టులో రియాజ్ 35 పరుగులు, అమీర్ 32 పరుగులు చేశారు. భారత మహిళా క్రికెటర్ బి. అనూష, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్ రెహాన్‌కు అందించారు.

బీకేఎస్ రీజియన్ జట్టు గెలుపు

అనంతపురం: ఆర్డీటీ సిబ్బంది క్రికెట్ టోర్నీ ఐదోరౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో బీకేఎస్ రీజియన్ జట్టు గెలుపొందింది. మెయింటెనెన్స్ అండ్ బీకేఎస్ రీజియన్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. తొలుత బీకేఎస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు గాను 166 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మెయింటెనెన్స్ జట్టు 102 పరుగులు మాత్రమే చేసింది.

- ఏ గ్రౌండ్‌లో అనంతపురం స్పోర్ట్స్ టీం, బత్తలపల్లి రీజియన్ మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బత్తలపల్లి జట్టు 130 పరుగుల చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన స్పోర్ట్స్ టీం నిర్ణీత 20 ఓవర్లకు గాను 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.

కాలసర్పదోష నివారణ పూజలు



ప్రశంసాపత్రాలతో నృత్యకారులు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం పూజలు చేశారు. కుజ దోష, కాలసర్పదోష పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి పూజలు, అభిషేకాలు చేశారు.

ఆలయంలో బాలికల నాట్య ప్రదర్శన: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తాడిపత్రి వాస్తవ్యులు అయిన వందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన చేశారు. కూచిపూడి, భరత నాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మది నిండుగా..జెండా పండుగ

పంద్రాగస్టు వేడుకలకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల ప్రారంభం నుంచే చిన్నా పెద్దా ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్యదినోత్సవంగా పిలిచే పంద్రాగస్టు వేడుకలకు సిద్ధమవుతున్నారు. అందుకోసం ఎక్కడ చూసినా జెండా పండుగ వాతావరణం నెలకొంది. కార్యాలయాలకు రంగులు వేసి, జెండాలు సిద్ధం చేస్తుంటారు. ప్రత్యేకంగా జాతీయ జెండాను పోలి ఉండే కలర్లను పోలి ఉండే దుస్తులు కూడా మార్కెట్ లోకి వచ్చాయి. దుకాణాల్లో జాతీయ పతాకాలతోపాటు దుస్తుల విక్రయాలు కూడా ఊపందుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



స్వాతంత్ర్య స్మారక చిహ్నం వద్ద జాతీయ జెండాలు విక్రయిస్తున్న యువతి



క్లాక్ టవర్ వద్ద విద్యుత్ వెలుగుల నడుమ నూతన ఫ్లై ఓవర్



జాతీయ పతాకాలు, దుస్తులు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

అనంత జిల్లా..
సమర యోధుల ఖిల్లా

అనంతపురం కల్చరల్: స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లావాసులూ తమదైన ప్రభావం చూపారు. బ్రిటీష్ వారిని తరిమికొట్టడంలో ఏకత్వం చాటారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా త్యాగధనులపై 'సాక్షి' ప్రత్యేక కథనం

- స్వాతంత్ర్య ఉద్యమంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న వారిలో కల్లూరు సుబ్బారావు ఒకరు. హిందూపురానికి వచ్చిన అనీబిసెంట్ ప్రసంగానికి ముగ్ధుడైన ఆయన జాతీయోద్యమంలో చేరారు. అప్పటికే ఆంధ్రోద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న అందరితో కలసి తెల్లవారిని తరిమికొట్టేందుకు ఎన్నో త్యాగాలను చేశారు. 1928 నవంబరులో నంద్యాలలో జరిగిన సభలో దత్తమండలాల పేరును రాయలసీమగా నామాంతరం చేసి చిరస్మరణీయంగా నిలిచిపోయారు.
- జిల్లా కేంద్రంలోని పెద్దగొంది కొండప్పది వినూత్న పోరాటం. సహజంగా నెమ్మది స్వభావమున్న ఆర్యవైశ్యులింట జన్మించినా.. ఎవరికీ వెరువని తత్వమున్న కొండప్ప స్వాతంత్ర్య సమరపోరులో పప్పూరు రామాచార్యులు, ఐదుకల్లు సదాశివన్, నీలం సంజీవరెడ్డి వంటి వారికి సహచరుడిగా ఉంటూ వచ్చారు. గాంధీజీ చేతుల మీదుగా నూలు వడికే రాట్నాన్ని అందుకున్నారు. తెల్లవారికి కంటగింపుగా మారిన కొండప్పను పెళ్లి పీటలపైనే అరెస్ట్‌చేసి బళ్లారి జైలుకు తరలించారు. స్వాతంత్ర్యానంతరం తామ్రపత్రమందుకున్న ఆయన భూదాన ఉద్యమంలో వినోబా భావే వెంట నడిచి సమ సమాజ స్థాపనకు తన వంతు పాత్ర పోషించాడు.
- తెల్లవారి పాలనలో పోలీసు ఉద్యోగం చేస్తున్న యరమల కొండప్ప అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేసి సహాయ నిరాకరణోద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దీనిని రాజద్రోహంగా పరిగణించిన బ్రిటీష్ దొరలు కొండప్పను కఠిన కారాగార శిక్షలతో చిత్రహింసలు పెట్టారు. కానీ స్వాతంత్ర్యం రాగానే విడుదలైన ఆయన గాంధీజీ పిలుపునందుకుని తన విలువైన రెండు ఎకరాల భూమిని నిరుపేదల కోసం దానం చేసి దేశభక్తికి నిదర్శనంగా మారారు. ఆయనిచ్చిన స్థలంలోనే హరిజన హాస్టల్ నడిచింది. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వంటి వారు చదువుకున్నారు. యర్రమల కొండప్ప సేవలకు గుర్తుగా అనంతపురంలోని అశోక్ నగర్‌లో ఆయన నిలువెత్తు విగ్రహం వెలిసింది.



అనంతపురం అశోక్ నగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు యరమల కొండప్ప విగ్రహం

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని చాటుదాం

అనంతపురం క్రైం: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నా భూమి– నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ స్వాతంత్ర్య పోరాటస్ఫూర్తిని చాటిచెప్పేందుకు నగరవాసులు ముందుకు రావాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14, 15 వ తేదీల్లో నగరంలోని ప్రతి ఇంటి, వ్యాపార సముదాయాలపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలన్నారు.

ఓటరు సర్వేను వేగవంతం చేయాలి

ఓటరు సర్వేను వేగవంతం చేయాలని బీఎల్‌ఓలను కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఓటరు సర్వేపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కమిషనర్ భాగ్యలక్ష్మి పీఎస్ నంబర్ 112 మంగళవారి కాలనీ, పీఎస్ 139 మారుతీనగర్, నాయక్‌నగర్, ఆదేవింగా ఆర్డీఓ కార్యాలయం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తిరుమలరెడ్డి పీఎస్ నంబర్ 246, 247, 248, డిప్యూటీ తహసీల్దార్ పీఎస్ 25, 26,27, 29,30 రుద్రంపేట, కళ్యాణదుర్గం రోడ్డు, రాంనగర్‌లో సర్వేను పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటరు సర్వేను నిర్లక్ష్యం చేయకూడదన్నారు.



నగరంలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

ఉమాదేవి కరువు కథల పరిశోధన చారిత్రకం

- అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం

అనంతపురం కల్చరల్: దివంగత ఉమాదేవి కరువు కథల పరిశోధన చారిత్రకమని అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాంలో అనంతలో విలయతాండవం చేసిన కరువు వచ్చిన కథల పరిశోధన గ్రంథం 'అనంత కరువు – ఇనుప గజ్జెల తల్లి' పుస్తకావిష్కరణ సభ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవోహోంలో ఆదివారం జరిగింది. అరసం జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డి ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచపాలెం చంద్రశేఖరరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి, పరిశోధన గ్రంథకర్త ఉమాదేవి కృషిని కొనియాడారు. పుస్తక సమీక్ష చేసిన సీనియర్ రచయిత్రి నిర్మలారాణి, ఆత్మీయ అతిథులు డాక్టర్ శాంతినారాయణ, మల్లెల నరసింహమూర్తి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి, నిర్వాహకులు చెట్ల ఈరన్న, ఆహ్వానం పలికిన పండిట్ రియాజుద్దీన్ తదితరులు అనంతలో కరువు రక్కసి చేసిన గాయాలు, రైతుల ఆత్మహత్యలపై వివరించారు. అంతకు ముందు ప్రజాగాయకుడు గద్దర్‌కు రచయితలు, కవులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు సడ్లపల్లి చిదంబరరెడ్డి, జెట్టీ జైరామ్, ఆకుపచ్చ వెంకటేష్, తరిమెల అమరనాథరెడ్డి, షరీఫ్, నాసీల నాగేంద్ర, సురేష్, అశ్వర్థ రెడ్డి, సత్యనారాయణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం తదితరులు

కోలాహలంగా పీర్ల ఊరేగింపు



జి.కొత్తపల్లిలో జలధికి తరలివెళ్తున్న పీర్లస్వాములు



ఎం.చెర్లోపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు

అనంతపురం కల్చరల్: నగర శివారులోని లెనిన్‌నగర్‌లో పీర్ల పండుగ ఉత్సాహంగా జరిపారు. ఉదయం నుంచి అంగార్‌వలి, హుసేన్ హుసేన్, హజరత్ అబ్దుల్ ఖాదర్ పీర్లకు వివిధ పుష్పాలతో అలంకరించి నగర వీధుల్లో ఊరేగించారు. జాతర అనంతరం పీర్ల మకానం వద్ద చక్కెర చదివింపులు జరిగాయి.

ముగిసిన మొహర్రం

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లి, మరూరు, జి.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. శనివారం పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్ల మకానంలో పీర్లకు పత్యేక పూజలు నిర్వహించారు. పీర్ల దేవుళ్లను రకరకాల పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో రైతులు చెట్లను తీసుకొచ్చి పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 7 గంటలకు పీర్లను గుండంలోకి దింపారు. మళ్లీ సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పీర్ల దేవుళ్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం, చంద్రచెర్ల గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు జరిగిన జలధి కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహించారు. పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి, అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం గ్రామ పుర వీధుల గుండా పీర్లస్వాములను ఊరేగిస్తూ జలధికి తరలించారు. మొహర్రం ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలేపల్లిలో జలధి

రామగిరి: మండలంలోని పోలేపల్లిలో ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహి ంచారు. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు గ్రామంలో పీర్లను ఊరేగించారు. గ్రామ వీధులగుండా పీర్లను మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగించి, అనంతరం జలధికి తీసుకెళ్లారు.



పానకాల జాతరలో పాల్గొన్న మేయర్ వసీం

ఏపీఎల్ 3కే రన్‌కు విశేష స్పందన



ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి సాగుతున్న 3కే రన్



క్రీడాజ్యోతితో భారత క్రికెటర్ హనుమ విహారి, డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్ రెడ్డి తదితరులు

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఎల్ సీజన్–2 విజయవంతం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన 3కే రన్‌కు విశేష స్పందన లభించింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద ప్రారంభించి సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వద్ద ముగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రికెటర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత క్రికెటర్, రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారి, భారత మహిళా క్రికెటర్ బి. అనూష హాజరయ్యారు. అనంతపురం క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి టార్చ్ వెలిగించి, భారత మహిళా క్రికెటర్ అనూషకు అందించారు. ఆమె చేతుల మీదుగా భారత క్రికెటర్ హనుమ విహారికి టార్చ్ అందించారు. ఈసందర్భంగా హనుమ విహారి మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఎల్ సీజన్–2 ఆగస్టు 16 నుంచి 27 వరకు ఏపీఎల్ సీజన్–2 విశాఖపట్నంలో జరగనుందన్నారు. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్ చంద్ర , సెక్రటరీ గోపీనాథ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, రాయలసీమ కింగ్స్ జట్టు వైస్ కెప్టెన్ గిరినాథ రెడ్డి, రంజీ ఆటగాడు ప్రసాద్ రెడ్డి, రాయలసీమ కింగ్స్ కోచ్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంతల ఆదాయం రూ.3.21 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.21 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్, సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,56,510 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,64,600 మేర వసూలైందని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామగిరి: విద్యార్థులు చదువుతోపాటు ఆటలపోటీల్లోనూ రాణించాలని చిగురు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్టు కలెక్టివ్ సహకారంతో చిగురు సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారన్నారు. ఆటలు, చదువుపై ప్రత్యేక దృష్టిసారిస్తే గ్రామానికి , రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రామన్న, రామాంజనేయులు, చిరంజీవి, రమ్య, రమాదేవి, పోతులయ్య, కల్పన, మంజుళ, గంగమ్మ, హనుమంతు, రామగిరి, చెన్నేకొత్తపల్లి, రొద్దం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

రామగిరి: మండలంలోని కానుగులకుంటకు చెందిన సుధాకర్, జయమ్మ దంపతుల కుమారుడు బాబు (14) కడుపునొప్పి తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బాబు రామగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొన్నిరోజులులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఉదయం తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం బాబు తల్లిదండ్రులు ఇంటి కొచ్చి చూసేసరికి దూలానికి వేలాడుతూ కనిపించాడు. ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఘనటా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

15న ఏఆర్‌టీ సెంటర్‌కు సెలవు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ ఈ నెల 15న మంగళవారం ఒక్కరోజు పనిచేయదని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెంటర్‌కు సెలవు అని తెలిపారు. మందులు తీసుకునే వారు 14న, 16వ తేదీ నుంచి రావాలని ఆయన కోరారు.

పాత పాటలతో ఆకట్టుకున్న గాయకులు

అనంతపురం కల్చరల్: తెలుగు సీమకు ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చిన దివంగత గాయకులకు అనంత కళాకారులు నీరాజనాలర్పించారు. ఆదివారం స్థానిక మూడోరోడ్డులోని ఘంటసాల భవన్‌లో సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో గాయనీగాయకులు పాటలు ఆలపించారు.

సీసీ రోడ్డు నిర్మించండి

రాప్తాడు: మండలంలోని చిన్మయనగర్‌లోని 4వ క్రాస్ (శివాలయం రోడ్డు)లో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీ వాసులు కేతిరెడ్డి పరంధామ రెడ్డి, రాజా, గణేష్, సతీష్, రామాంజనేయులు, రామ్మోహన్ రెడ్డి, ధనుంజయ, నాగమణి, నీరజ, భారతి తదితరులు కోరుతున్నారు. వారు మాట్లాడుతూ చిన్మయనగర్ నుంచి బెంగళూరు, చెన్నై హైవే మీదకు వెళ్లాలంటే శివాలయం రోడ్డు మీదుగానే వెళ్లాలన్నారు. వర్షాలు, వాహనాలు ఎక్కువగా తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినిందన్నారు.

ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

కనగానపల్లి: రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ నరేష్‌చౌదరిపై చర్యలు తీసుకోవాలని వేపకుంట, మద్దెలచెరువు గ్రామాల రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం సాయంత్రం రైతులు ఆనందరెడ్డి, నారాయణరెడ్డి, రామలింగారెడ్డి, నారాయణ, గోవిందు,తిప్పయ్య, సోమశేఖర్ విలేకరులతో మాట్లాడారు. పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వేపకుంట, మద్దెలచెరువు గ్రామాల్లో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య వస్తోందన్నారు. దీన్ని పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరడానికి రైతులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్తే ఆపరేటర్ రైతులపై దురుసుగా వ్యవహరించాడన్నారు. రైతులే సబ్‌స్టేషన్‌పై దాడి చేశారని ఐటీడీపీ ద్వారా సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడన్నారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించకుండా రైతు సమస్యలు కూడా రాజకీయం చేస్తున్న ఆపరేటర్‌ను తొలగించి, చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

చెస్‌లో అనంత క్రీడాకారుల ప్రతిభ



చెస్‌లో ప్రతిభ చాటిన అనంత క్రీడాకారులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అండర్–11 ఓపెన్ అండ్ బాలికల చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీలు శ్రీకాకుళంలో ఈనెల 10 నుంచి 13 వరకు జరిగాయి. ఇందులో అనంతపురానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 7.5 పాయింట్లతో చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. సహృద్ ఎంపి 6.5 పాయింట్లతో 4వ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

భారత క్రికెటర్లకు విందు

అనంతపురం: భారత క్రికెటర్ , రాయలసీమ కింగ్స్ కెప్టెన్ హనుమవిహారి, భారత మహిళా క్రికెటర్ బి.అనూష, రాయలసీమ కింగ్స్ జట్టు సభ్యులకు అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి స్వాగతం పలికారు. కోగటం ఇంట్లో ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున క్రికెట్ అభిమానులు హాజరయ్యారు.